క్లుప్తంగా

రెడ్డి సంఘం 'గ్రామ' అధ్యక్షుడిగా రాజిరెడ్డి



శాయంపేట : మండలంలోని పత్తిపాకలో రెడ్డి సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రూపిరెడ్డి రాజిరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా పిన్నింటి కిషన్ రెడ్డి, చిట్టిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, ముస్కుల తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి సాంబరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర చంద్రమౌళి గాయాల పాలయ్యాడు. కులవృత్తిలో భాగంగా ఆయన తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో ఆయన ఎడమ కాలు విరిగింది. నడుముకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు, స్థానికులు చంద్రమౌళిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ




ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన రామ రామనాథం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత రామనాథం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చైర్మన్ వెంట సర్పంచ్ కుమారస్వామి, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీశ్, సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

'రైతులకు బేడీలు వేయడం దుర్మార్గం'

ఐనవోలు : రైతులకు బేడీలు వేయడం దుర్మార్గమని ఏఐకేఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మడిగె నాగరాజు, మేకిరి మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి ఆందోళన చేసిన సుమారు 750 మంది రైతులను చంపిందని గుర్తు చేశారు. రైతు పక్షపాతిగా ఊదరగొడుతూనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులపై లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. ఈనెల 18న మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాసంఘాల మండల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ఆన్‌లైన్ సెమినార్‌లో తాళ్ల పద్మావతి విద్యార్థులు



కరీమాబాద్: ప్రపంచ వ్యాప్తంగా ప్రతీనెలా నిర్వహించే ఆన్‌లైన్ సెమినార్‌లో భాగంగా గురువారం నిర్వహించిన సెమినార్‌లో వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 15మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో దాదాపు 20 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా సమకాలీన దేశీయ, అంతర్జాతీయ విషయాలపై ఆన్‌లైన్‌లో చర్చాగోష్ఠి నిర్వహించారు. జపాన్, రొమేనియా, నైజీరియా, వియత్నాం, టర్కీ, పాకిస్తాన్, తైవాన్, ఇండియా, మలేషియా, ఈజిప్టు, ట్యునీషియా తదితర దేశాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అయితే 'భారతదేశపు ప్రస్తుత పరిస్థితులు', 'అవాంఛిత పాఠశాల నియమాలు' అనే రెండు అంశాలపై తాళ్ల పద్మావతి విద్యార్థులు మాట్లాడారు. ఈ నేపథ్యంలో వారిని పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ వరుణ్, ప్రిన్సిపాల్ స్వర్ణ, గైడ్ శ్రీదేవి, సర్మా అభినందించారు.

గురుకులాల్లో టెండర్లు రద్దు చేయాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని మడికొండ బాలికలు, హసన్‌పర్తి బాలికలు, భూపాలపల్లి డిగ్రీ మహిళా కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్యాటరింగ్ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వకుండానే గుత్తేదారులకు అమ్ముకున్నారని బీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ తెలిపారు. ఆ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లోని కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.



శాయంపేట : ర్యాలీలో చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



ఐనవోలు : కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ



ఎల్కతుర్తి : ప్రశంస పత్రాలు అందజేస్తున్న..

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : పల్లెల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని సాధనపల్లి, గంగిరేణిగూడెం గ్రామాల్లో చేపట్టిన ర్యాలీని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాతే పల్లెల్లో సౌకర్యాలు మెరుగు పడ్డాయని చెప్పారు. సీఎం కేసీఆర్ పల్లెలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. అనంతరం జీపీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాకలో..

మండలంలోని పత్తిపాకలో పంచాయతీ సిబ్బందిని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి సన్మానించారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు పెండెల కిరణ్, నాయకులు మల్లయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో గణనీయమైన అభివృద్ధి

ఐనవోలు : సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో పల్లెల్లో గణనీయమైన అభివృద్ధి సాధించామని ఎంపీపీ మార్నేని మధుమతి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం మెరుగుపడినట్టు తెలిపారు. సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయన్నారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలను, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ముందు జాతీయ జెండా ఎగరేశారు. పల్లె ప్రగతి ద్వారా మంజూరైన నిధుల వివరాలతోపాటు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని కార్యదర్శి చదివి వినిపించారు. ఉత్తమ జీపీల సర్పంచ్‌లను సన్మానించారు. పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ చేసి ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. సెగ్రిగేషన్ షెడ్‌లో తయారైన సేంద్రియ ఎరువులను రైతులకు అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి జెండా ఎగరేశారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. గ్రామసభ ఏర్పాటు చేశారు. నర్సరీలను సందర్శించారు. మల్టీపర్పస్ వర్కర్లను శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నడికూడ : జీపీ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్



దామెర : ల్యాదెళ్లలో ర్యాలీ

నడికూడ : మండలంలోని కౌకొండ, ఇతర గ్రామాల్లో ర్యాలీ తీశారు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో, గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల ఎదుట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ల్యాదెల్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి మాధవి లత, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ శ్రావణ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకే 'చల్లా'పై ఆరోపణలు



మాట్లాడుతున్న సోదా రామకృష్ణ

పరకాల : పరకాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సోదా రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులతోనే దామెర చెరువు నుంచి వైకుంఠధామానికి మట్టి తరలిస్తుండగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి మద్యం తాగించి బీజేపీ శ్రేణులతో అర్ధరాత్రి అడ్డుకున్నారని మండిపడ్డారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో పగటి వేళల్లో ట్రాక్టర్లు రాకపోతుండడంతో రాత్రివేళ మట్టిని తరలించినట్టు తెలిపారు. పనుల వేగవంతం కోసం ప్రైవేటు కంపెనీ వాహనాలను వినియోగించారని చెప్పారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి అభివృద్ధి పనులను అడ్డుకునే కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఏటా వర్షాకాలంలో దామెర చెరువు మత్తడి నీటితో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యను పరిష్కరించేలా ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రభుత్వం నుంచి రూ.12.50 కోట్లు మంజూరు చేయించి పనులు చేయిస్తుండగా తమ బంధువులను ఉసిగొల్పి కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. మొలుగూరి భిక్షపతి వాస్తవాలను వక్రీకరిస్తూ బీజేపీని బజారుకీడుస్తున్నాడని దుయ్యబట్టారు. చిల్లర మాటలతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, స్థానిక పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మడికొండ సంపత్, దామెర మొగిలి, ఏకు రాజు, కోఆప్షన్ సభ్యుడు యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'మొలకెత్తని వరి విత్తనాలతో నష్టపోయా'



నడికూడ : మొలకెత్తని వరి విత్తనాలతో తాను నష్టపోయినట్టు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన భాషక రవి తెలిపాడు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ నుంచి వరి బీపీటీ 5204 రకం, రూ.6 వేల 640 విలువైన విత్తనాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. వారం రోజులు గడుస్తున్న విత్తనాలు పగల్లేదని, మొలక పీకలు సైతం రాలేదని చెప్పారు. సమస్యను బాధ్యుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తాను కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లును చూపించారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని రవి కోరారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏఓ కవిత

ఐనవోలు : మండల కేంద్రంలోని అన్నపూర్ణ అగ్రిమాల్, కీర్తి సీడ్స్, లక్ష్మి ఫర్టిలైజర్ డిపో, మమత అగ్రి ఏజెన్సీస్, ఓం శ్రీ ఫర్టిలైజర్ షాపుల్లో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) అడప కవిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లను, బిల్లు బుక్కులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నకిలీ విత్తనాలపై ఆరాతీశారు. పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.853లు ఉండగా అధిక ధరలకు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని రైతులను ఆమె కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారస్తుల లైసెన్స్ రద్దు చేయడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఊరు పేరు లేని ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్మవద్దని స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులే విక్రయించాలని సూచించారు.

మహనీయులకు నివాళి

హన్మకొండ: మహాకవి శ్రీశ్రీ, కల్నల్ బిక్కుమళ్ల సంతోష్ బాబు వర్ధంతిని హనుమకొండ హనుమాన్ నగర్-1లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), దేశ రక్షణ కోసం చైనా సరిహద్దుల్లో వీరమరణం పొందిన మహా వీరచక్ర కల్నల్ బిక్కుమళ్ల సంతోష్‌బాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు కుమార్‌రెడ్డి, మాదారపు ఉదయ్‌కిరణ్, సిరిమల్లె రాజయ్య, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, సురేష్, రాంచందర్, రియాజ్, పాల్గొన్నారు.

'అనుమతి లేకుండా విద్యా సంస్థలు నిర్వహించొద్దు'

వరంగల్ చౌరస్తా: అనుమతి లేకుండా విద్యాసంస్థలు నిర్వహిస్తే ప్రత్యక్ష దాడులు చేస్తామని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున హెచ్చరించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో రామ్‌మోహన్ అధ్యక్షతన ఏఐఎఫ్‌డీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫీజు నియంత్రణ కమిటీ వేసి అధిక ఫీజులను అధికారులు అరికట్టాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర కోశాధికారి పోతుగంటి కాశి, పిట్టల సాయికుమార్, మోహన్, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

న్యూశాయంపేట: ఇళ్లు లేని పేదలకు పక్కా గృహాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇచ్చి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. వేసుకున్న గుడిసెలను కూల్చివేసి దాడులకు పాల్పడటం సరైంది కాదని అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడుతూ ఈనెల 18నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర, 19న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, వచ్చే నెల 3న కలెక్టరేట్‌ల ఎదుట మహా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు టి.ఉప్పలయ్య, బి.చక్రపాణి, జి.వెంకట్, సంపత్, దీప, కిషోర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కరీమాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ కన్వీనర్ మూడేళ్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ తోటలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు అప్పాజి వాణి, మద్దూరి విజయ, విమల, రమ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

502 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: జిల్లాలో గురువారం ఉదయం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో 7,121 మంది విద్యార్థులకు 6,619మంది హాజరుకాగా, 502 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య డీఐఈవో గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షలో 1,659మంది విద్యార్థులకు 1,572 మంది విద్యార్థులు హాజరయ్యాయని వివరించారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి జన్ను కిరణ్‌కుమార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సమ్మయ్య మాట్లాడారు. జన్ను కిరణ్‌కుమార్ కష్టపడి చదివి ఎంఫార్మసీ కోర్సులో టాపర్‌గా నిలిచారని గుర్తు చేశారు. 2011లో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రభుత్వ అనలిస్టుగా, 2017లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని వివరించారు. 2021లో నగరంలో పాపాయ్యపేట చమన్‌లో మెగా ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ బొరగాల రాజమోహన్, అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్, పరిశోధక విద్యార్థులు శ్రీరమ్య, స్వర్ణలత, సుప్రియ, స్ఫూర్తి, కుమార్, భరత్, స్నేహ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.రాజయ్య

ధర్మసాగర్ : ప్రజలందరి అనారోగ్య సమస్యలు పరిష్కరించి ఆరోగ్యవంతమైన తెలంగాణాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. వేలేరు మండలంలోని బండతండ, చింతల్‌తండ, కమ్మరిపేట, సోడశపల్లి, గుండ్లసాగర్, మల్లికుదుర్ల, ధర్మసాగర్ మండలంలోని జానకిపురం, క్యాతంపల్లి, కాశగూడెం, రాయిగూడెం, తాటికాయల గ్రామాల్లో గురువారం ఆయన ప్రగతి నివేదన యాత్ర చేపట్టారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బందిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పెద్దపెండ్యాల గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన పాలన అందించడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలే కాకుండా పేదల అవసరాన్ని గుర్తించి ఎవరూ అడగకున్నా షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, దళితబంధు, తదితర అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తూ పేదరిక నిర్మూలన దిశగా అవిశ్రాంతంగా పాటుపడుతున్నారంటూ సీఎం కేసీఆర్‌ను కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలనూ అర్హులకు రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, జెడ్పీటీసీలు చాడ సరిత, పిట్టల శ్రీలత, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భారీగా గడ్డివాము, పైపులు దహనం

● సోదరిపై పోలీసులకు ఫిర్యాదు



కాలిపోతున్న గడ్డివాము

ఐనవోలు : తన గడ్డివామును, పైపులైను తన సోదరి దహనం చేసిందంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన దామెరగిద్ద రాజేశ్, దోబిల మౌనిక అన్నాచెల్లెలు. ఇద్దరి మధ్య భూముల విషయంలో గొడవలున్నాయి. ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. విచారణ కొనసాగుతోంది. కాగా రాజేశ్ సమకూర్చుకున్న 250 కట్టల గడ్డివామును, సుమారు 80 పైపులను మౌనిక తగులబెట్టింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మిథున సంక్రమణ పూజలు



రుద్రహోమంలో చైర్మన్ జయపాల్, ధర్మకర్తలు



నజరు పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

ఐనవోలు : సూర్యుడు మిథున రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు గురువారం మిథున సంక్రమణ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వారి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం మిథున సంక్రమణ పూజలతోపాటు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం చేశారు. అలాగే గొల్ల కేతమ్మ, బలజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణాన్ని శైవాగమోక్తంగా జరిపించారు. ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహామండపంలో నజరు పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. పూజలను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జయపాల్, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, ధర్మకర్తలు రామిండ్ల స్వప్న, బొల్లపెల్లి వేంకటేశ్వర్లు, పాక ఉపేందర్, గోక రాజు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి దళితబంధు యూనిట్ పంపిణీ



ఐలయ్యకు యూనిట్ అప్పగిస్తున్న అధికారులు

కమలాపూర్ : మండలంలోని మరిపెల్లిగూడెం గ్రామానికి చెందిన ఇనుగాల ఐలయ్యకు మంజూరైన దళితబంధు యూనిట్‌ను ఎస్సీ కార్పొరేషన్ డీఈఓ శంభు, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ స్వాతి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు ఐలయ్య మాట్లాడారు. ప్రభుత్వం తనను లబ్ధిదారుగా ఎంపిక చేయడంతో ఎలక్ట్రికల్ ప్లంబింగ్ యూనిట్‌ను ఎంచుకొని కొటేషన్ సమర్పించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ దుకాణం యజమాని మిట్టపల్లి ప్రభాకర్ నుంచి యూనిట్‌ను ఇప్పించినట్టు చెప్పారు. అధికారులకు, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న భూమయ్య, నాయకులు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లిలో ఇళ్ల నిర్మాణానికి పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున సాయం అందించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు పరికరాల భూమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం నాయబ్ తహసీల్దార్ భద్రునాయక్‌కు తహసీల్దార్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అందజేసింది. అనంతరం భూమయ్య మాట్లాడారు. ఇల్లు లేని పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. 51 మంది పేదల జాబితాను నాయబ్ తహసీల్దార్‌కు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంగాల అనిత, సరిత, దైనంపల్లి కవిత, గీత, జీడిమడ్ల స్నేహ, పూల తదితరులు పాల్గొన్నారు.

35మంది విద్యార్థులకు ఉద్యోగాలు

హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ కళాశాలకు చెందిన 35 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఏడు కంపెనీలు ఇంటర్వ్యూ నిర్వహించగా, పెంటగాన్ స్పేస్‌లో 8మంది విద్యార్థులు, ఎస్‌వీఎస్ హెల్త్‌లో 9మంది, ప్రతిమలో ముగ్గురు, మమత ఇన్‌ఫ్రాలో 15మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తిరుమల్‌రావు వివరించారు. విద్యార్థులకు ఎస్‌వీఎస్ కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవీ.రావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సుకాంత్ తదితరులు పాల్గొన్నారు.